# 9న జేసీజే మోడల్ టెస్ట్



రామన్నపేటలో జీసీజే మోడల్ టెస్ట్ కరపత్రం విడుదల చేస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

రామన్నపేట, జూన్ 7 : ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 9న ఉదయం 10గంటలకు హైదరాబాద్‌లోని అంబేద్కర్ లా కాలేజీలో జూనియర్ సివిల్ జడ్జి మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ మజీద్, ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పరీక్షకు సంబంధించిన కరపత్రం విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు జినుకల ప్రభాకర్, పాల్వంచ జగతయ్య, యాదాసు యాదయ్య, సుక్క శ్రవణ్‌కుమార్, దినేశ్‌కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

## వైద్యానికి ఆర్థిక సాయం

రాజాపేట, జూన్ 7 : మండల కేంద్రానికి చెందిన నిరుపేద అయిన దొంతి మహేశ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. పేదింటి బిడ్డకు ఆర్థిక సాయం అందించాలని గ్రామ యువకులు సోషల్ మీడియాలో పోస్టు పెట్టడంతో గ్రామస్తులు, స్నేహితులు స్పందించారు. వారంతా రూ.60 వేలు పోగు చేసి మహేశ్ వైద్య ఖర్చులకు అందజేశారు. ఊట్కూరి అశోక్‌గౌడ్, కూతురు లింగం, కుమ్మరి లక్ష్మణ్, మధు, కృష్ణ, వినోద్, దాసు, కృష్ణ, భరత్, ప్రశాంత్, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న గ్రామస్తులు

## గుంటకండ్ల సావిత్రమ్మకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నివాళి

నాగారం, జూన్ 7 : మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మాతృమూర్తి సావిత్రమ్మ 10వ వర్ధంతిని శుక్రవారం నాగారంలో నిర్వహించారు. ఆమె సమాధిపై తన తండ్రి చంద్రారెడ్డితో కలిసి జగదీశ్‌రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ కళాకారుడు చిప్పల పల్లి సుధాకర్ అలియాస్ డప్పు సుధాకర్ గుండెపోటుతో మృతిచెందగా ఆయన భౌతికకాయానికి సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట ఎంపీపీ కూరం మణివెంకన్న, సోమయ్య, సత్తయ్య, సైదులు, చిరంజీవి, మల్లేశ్ ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం : సీపీఎం

ఆత్మకూరు(ఎం), జూన్ 7 : ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం కొనసాగిస్తామని సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం అన్నారు. మండలంలోని కూరెళ్లలో శుక్రవారం జరిగిన పార్టీ గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఓడినా, గెలిచినా సీపీఎం ఎప్పుడూ ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. భువనగిరి ఎంపీగా పోటీ చేసిన సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌కు ఓట్లు వేసి ఆదరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి తుమ్మలగూడెం యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ మల్లయ్య, నాయకులు నర్సయ్య, రాజమల్లు, ఐలయ్య, బుగ్గయ్య, లక్ష్మి, పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

భువనగిరి అర్బన్, జూన్ 7 : వరంగల్‌లో జూలై 7న జరిగే ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకుడు దుబ్బ దానయ్య అన్నారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగల ఆత్మగౌరవానికి ప్రతీకగా లక్షలాది మంది మాదిగలు ఈ కవాతుకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొల్లూరి హరీశ్, నాయకులు లింగస్వామి, స్వామి, కుమార్, శ్రీనివాస్, బసవయ్య, శ్రీకాంత్, జహంగీర్, పాల్గొన్నారు.

## శ్మశాన వాటిక నిర్మాణ పనులను పూర్తి చేయాలి

భూదాన్ పోచంపల్లి, జూన్ 7 : పట్టణ శివారులో నిర్మిస్తున్న శ్మశాన వాటిక పనులను వెంటనే పూర్తి చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) పోచంపల్లి పట్టణ కార్యదర్శి పగడాల శివ కోరారు. పట్టణ శివారులోని శ్మశాన వాటిక స్థలంలో పీవైఎల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులను అధికారులు, ప్రజాప్రతినిధులు అక్రమంగా కాజేశారని ఆరోపించారు. శ్మశాన వాటిక నిర్మాణాన్ని మరిచారని, స్నానపు గదులు, నీటి సదుపాయం లేక అంత్యక్రియలకు వచ్చిన ప్రజలు, మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. శ్మశాన వాటిక పనులను వెంటనే పూర్తి చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సూరిబాబు, అశోక్, సాయి, గణేశ్, శివ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

రామన్నపేట, జూన్ 7 : మండలంలోని మునిపంపుల గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతిచెందాయి. మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన రైతు చిల్ల వెంకటయ్య తన ఐదు గేదెలను గురువారం మేతకు వదిలాడు. సాయంత్రం 3 బర్రెలు తిరిగి ఇంటికి రాగా.. రెండు రాలేదు. రాత్రి వరకు చుట్టుపక్కల వెతికినా దొరకలేదు. శుక్రవారం మునిపంపుల గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు బర్రెలు మృతి చెంది ఉన్నాయన్న సమాచారంతో అక్కడికి వెళ్లి చూశాడు. వెంకటయ్య తన గేదెలు మృతిచెంది ఉండడాన్ని చూసి బోరున విలపించాడు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బీబీనగర్, జూన్ 7 : మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ సుగుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 132 కేవీ లైన్ మరమ్మతుల దృష్యా మండల కేంద్రంలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, వెంకిర్యాల, కొండమడుగు, గ్రామాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

## బొలేరో కింద పడి బాలుడు మృతి

తుర్కపల్లి, జూన్ 7 : మండలంలోని వేల్పుపల్లి గ్రామంలో బొలేరో కింద పడి రెండేండ్ల బాలుడు మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొర్రెంకల బాలరాజు, సంతోష దంపతులకు ఇద్దరు కొడుకులు. వారి చిన్న కుమారుడు శశి (2ఏండ్లు) శుక్రవారం ఇంటి ముందు ఆడుకుంటుండగా.. తన సమీపంలో ఉన్న వాటర్ ఫిల్టర్ వద్దకు బొలేరో వచ్చింది. బాలుడు ప్రమాదవశాత్తు దాని కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా దవాఖానకు తరలించి దర్యాప్తు చేపట్టారు.

శశి (ఫైల్)

# విద్యార్థుల నమోదు పెంపే లక్ష్యంగా బడిబాట

- డీఈఓ అశోక్
- జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల ముమ్మర ప్రచారం

కోదాడ టౌన్ : శ్రీరంగాపురంలో బడిబాటను తనిఖీ చేస్తున్న డీఈఓ అశోక్



నేరేడుచర్ల : నేరేడుచర్లలో నిర్వహించిన బడిబాటలో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు

కోదాడ టౌన్, జూన్ 7 : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదే లక్ష్యంగా నిర్వహించే బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని డీఈఓ అశోక్ అన్నారు. శుక్రవారం కోదాడ మండలంలోని శ్రీరంగాపురంలో బడి బాట కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థుల నమోదును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ పాఠశాలల్లో అమలయ్యే సంక్షేమ పథకాలు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రోజువారీగా విద్యార్థుల నమోదు వివరాలను ఎంఈఓ ద్వారా జిల్లా విద్యా శాఖ కార్యాలయానికి పంపాలని సూచించారు. బడిబాటలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అమ్మ ఆదర్శ కమిటీలు బడిబాట నమోదులో సహకారం అందించాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అమ్మ ఆదర్శ కమిటీల పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భానుమతి, కళావతి పాల్గొన్నారు.

గరిడేపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారి యర్రంశెట్టి రాంబాబు అన్నారు. మండల కేంద్రంలో ఎంఈఓ పి.చత్రనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మానస. షరీఫ్, సుశీల, సీఆర్పీలు రామకృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యా బోధన అందించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, రమేశ్, మురళి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, యాదగిరి, విష్ణుకుమార్, రాజీవ్ పాల్గొన్నారు.

చిలుకూరు : బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని రామ్‌నగర్‌లో ఉపాధ్యాయులుఉ ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం కొండా వెంకయ్య, ఉపాధ్యాయుడు వీరబాబు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మోతె : మండలంలోని విభలాపురం, మామిళ్లగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఆధ్వర్యంలో గ్రామాల్లో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు.

మేళ్లచెర్వు : మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం ముమ్మరంగా సాగింది. పాఠశాలల్లోని వసతులను వివరిస్తూ అడ్మిషన్ల పెంపే లక్ష్యంగా ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రామాపురం గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వర్‌రావు ప్రారంభించారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి : జిల్లా సెక్టోరియల్ అధికారులు

నేరేడుచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా సెక్టోరియల్ అధికారులు రాంబాబు, జనార్ధన్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట ర్యాలీలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ చత్రునాయక్, హెచ్ఎం బట్టు మధు,



పెన్‌పహాడ్ : చీదెళ్లలో బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మద్దిరాల : మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

చిలుకూరు : రామ్‌నగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ బడిబాటపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మోతె : విభలాపురంలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మేళ్లచెర్వు : రామాపురంలో బడిబాటను ప్రారంభిస్తున్న ఎంపీపీ పద్మాసైదేశ్వర్‌రావు

## మట్టపల్లి నృసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి, జూన్ 7 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నృసింహుడి నిత్య కల్యాణంను అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేసి పట్టు వస్త్రాలతో అలంకరించి పూజలు చేశారు. కల్యాణ మండపంలో కల్యాణం నిర్వహించారు. అనంతరం గరుడ వాహనంపై స్వామి వారిని ఊరేగించారు. పూజా కార్యక్రమాలలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్, దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై స్వామి వారిని ఊరేగిస్తున్న అర్చకులు

## నల్లా కనెక్షన్ సర్వే సకాలంలో పూర్తి చేయాలి

మండల కేంద్రంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

- ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు

చివ్వెంల, జూన్ 7 : మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని టీఓటీ, పెన్‌పహాడ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు అధికారులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో చివ్వెంల, మోతె, అత్మకూర్(ఎస్) మండలాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలకు నిర్వహించిన మిషన్ భగీరథ నల్లా కలెక్షన్ యాప్ సర్వే శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపీఓలు గోపి, హరిసింగ్, పరాంకుశరావు, సంజీవ పాల్గొన్నారు.

### మిషన్ భగీరథ మొబైల్ యాప్‌పై అవగాహన

తుంగతుర్తి, జూన్ 7 : నియోజకవర్గంలోని పంచాయతీ కార్యదర్శులు, మల్టీ పర్పస్ వర్కర్లు, అంగన్‌వాడీలకు పెన్‌పహాడ్, తుంగతుర్తి ఎంపీడీఓల ఆధ్వర్యంలోమిషన్ భగీరథ మొబైల్ యాప్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎంపీడీఓలు, పంచాయతీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## జూలై 7న వరంగల్‌లో మాదిగల ఆత్మగౌరవ కవాతు

- విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాజన్న పిలుపు

బొడ్రాయిబజార్, జూన్ 7 : జూలై 7న వరంగల్‌లో జరిగే మాదిగల ఆత్మ గౌరవ కవాతును విజయవంతం చేయాలని ఎంఎస్పీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్నమదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 7న 30 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవం వరంగల్‌లో లక్షలాది మంది ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కార్యకర్తలతో కవాతు నిర్వహిస్తున్నందున జూన్ 6 నుంచి జూలై 7 వరకు అన్ని గ్రామ, మండల, జిల్లా కమిటీల పునర్నిర్మాణం చేసి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు కందుకూరి సోమన్న, ఎర్ర వీర స్వామి, కొండపల్లి ఆంజనేయులు, బోడ శ్రీరాములు, ఏపూరి రాజు, పుట్టల మల్లేశ్, మోషా, ఎల్.శ్రీనివాస్, దైద శ్రీను, బొజ్జ వెంకన్న, మేడి కృష్ణ, తాటిపాముల నవీన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్పీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు రాజన్న

## టాస్క్ శిక్షణతో ఉద్యోగావకాశాలు

- అకడమిక్ అడ్వైజర్ నాగేశ్వర్‌రావు

కోదాడ టౌన్, జూన్ 7 : టాస్క్ శిక్షణతో బీటెక్ విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల అకడమిక్ అడ్వైజర్ పోతుగంటి నాగేశ్వర్‌రావు, డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ నాగార్జునరావు అన్నారు. శుక్రవారం కళాశాలలో టాస్క్ శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులో నైపుణ్యత కోసం కళాశాల యాజమాన్యం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ గాంధీ మాట్లాడుతూ.. బీటెక్ విద్యార్థులకు ఫైథాన్, డిజాంగ్‌పై ప్రత్యేక శిక్షణ ఉన్నత లక్ష్యాల సాధనకు ఎంతో దోహదపడుతుందన్నారు. కళాశాల యాజమాన్యం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టాస్క్ ట్రైనర్ రాకేశ్ విద్యార్థులకు ప్రోగ్రాంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణారావు, హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పని 200 రోజులు కల్పించాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు

బొడ్రాయిబజార్, జూన్ 7 : ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ధర్మభిక్షం భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నిబంధనల ప్రకారం ఉపాధి కూలీలకు రూ.300 చెల్లించాల్సి ఉండగా కేవలం 150 నుంచి 200 మాత్రమే చెల్లిస్తున్నారని, కొన్ని మండలాల్లో కేవలం రూ.130 చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని కాలరాయాలని చూస్తే రానున్న స్థానిక ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీని బొంద పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం ఉన్నారు.

## గుండెపోటుతో డప్పు సుధాకర్ మృతి

నాగారం, జూన్ 7 : తెలంగాణ ఉద్యమకారుడు, గాయకుడు, మండల కేంద్రానికి చెందిన చిప్పలపల్లి అలియాస్ డప్పు సుధాకర్ శుక్రవారం గుండెపోటుతో మరణించారు. ఎమ్మెల్యే మందుల సామేల్, తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీమ్ లీడర్ వేముల నరేశ్, ఉద్యమ గాయని వేముల పుష్పక్క ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో శ్రీధర్, పాలకుర్తి శ్రీకాంత్, గడ్డం ఉదయ్, ఉపేందర్, సాయి యాకన్న, నరేందర్, రాజకీయ నాయకులు, కళాకారులు ఉన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- సీఐ శ్రీనివాస్‌నాయక్

మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాస్‌నాయక్

మద్దిరాల, జూన్ 7 : దుకాణదారులు రైతులకు నకిలీ విత్తనాలు, పురుగు మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తుంగతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌నాయక్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్, ఫెస్టిసైడ్, సీడ్స్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. దుకాణాల యజమానులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, మందులు అమ్మి రైతుల మన్ననలు పొందాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ మధు పాల్గొన్నారు.

## ఫణిగిరి సీతారామచంద్రస్వామి ఆలయ భూముల కౌలుకు వేలం

నాగారం, జూన్ 7 : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో గల సీతారామచంద్ర స్వామి ఆలయ భూముల కౌలుకు శుక్రవారం వేలం నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి గాను ఆలయ ఆవరణలో ఆలయ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్, దేవాదాయ శాఖ ఈఓ వై.శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో 77 ఎకరాల భూముల కౌలుకు వేలం పాట నిర్వహించగా పలువురు రైతులు రూ.6 లక్షలకు దక్కించుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి, ఆలయ కమిటీ డైరెక్టర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల, జూన్ 7 : నేరేడుచర్ల పట్టణంలో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్‌లో గల మసీదు, ఎస్ఆర్‌టైడ్ ఫంక్షన్ హాల్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో విద్యుత్ స్తంభాల మార్పిడి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నందున ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

## పూలే అంబేద్కర్ ఆశయ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సురేందర్

సురేందర్

అర్వపల్లి, జూన్ 7 : పూలే, అంబేద్కర్ ఆశయ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన హైకోర్టు న్యాయవాది నక్కల నరేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శతకోటి వెంకన్న, కోశాధికారిగా యాతాకుల యాదగిరి ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదుల వీర పాపయ్య కొత్త కమిటీని అభినందించి నియామక పత్రం అందజేశారు.

## ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

మోతె, జూన్ 7 : ఎలుకల మందు తాగిన మహిళా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో కన్నుమూసింది. ఈ ఘటన మండలంలోని సిరికొండ గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరికొండ గ్రామానికి చెందిన ఎలుగు నాగయ్య-ఉపేంద్ర(32) దంపతులు. వారికి శ్రీవల్లి, శ్రీవాణి అనే ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కాగా నాగయ్య ఏడేండ్ల క్రితం చనిపోయాడు. అప్పటినుంచి ఉపేంద్ర తన ఇద్దరు ఆడ పిల్లలతో కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్నది. అత్తా మామ ముసలివాళ్లు కావడం, జీవనోపాధి సైతం కష్టంగా మారడంతో ఇటీవలి మనస్థాపానికి గురైంది. తన తమ్ముడు నాగరాజును ఈ నెల 3న ఇంటికి పిలిపించుకుని బాధలు చెప్పుకున్నది. ఈ క్రమంలోనే ఎలుకల మందు తాగింది. వాంతులు చేసుకుంటుండగా నాగరాజు చూసి ప్రశ్నించగా ఎలుకల మందు తాగినట్లు చెప్పడంతో వెంటనే చికిత్స కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి చనిపోయింది. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.